

## "రాముడూ! రాముడూ!"

ఆ పిలుపు ఎండవేళ నిద్రపోతున్న సుమిత్రకు ఎవరో తట్టి లేపినట్లు వినిపించింది. తలుపు తెరుచుకొని ఒక్క ఊపులో వీధి వరాండాలోకి వచ్చింది. క్షణకాలం ఆమె కళ్లు కోల్పోయిన కాంతిని తిరిగి తెచ్చుకొన్నాయి ఆమె హృదయం ఆత్రంగా స్పందించింది. రాముడి పేరు గల పిల్లడికోసం వెతుకులాడింది ఆమె మనసు.

చూపు అందినంతవరకు వీధిలో ఇటు అటు దృష్టి తిప్పి చూసింది సుమిత్ర రాముడు ఎక్కడా కనిపించలేదు. నిరాశగా ఆమె వెనుతిరిగింది అంతలో అదే పిలుపు తిరిగి వినిపించింది

"రాముడూ, నిన్నే పిలుస్తున్నది ఇటు రా. ఎండలో ఏమి టా తిరగడం?"

ఎదుటి వాసలో ఒక ఇంటి గుమ్మంలో నిలబడి ఎవరో అమ్మాయి పిలుస్తున్నాది. ఆమె పిలుపుకు జవాబుగా ఒక బొచ్చుకుక్క తోక ఆడించుకొంటూ దగ్గరికి వచ్చింది "ఆఁ అదీ అలా పిలవగానే రావాలి" అంటూ ఆ కుక్కను చేతుల్లోకి తీసుకొని, గుండెల కదుముకొంటూ ఇంటి లోపలికి వెళ్లిపోయింది ఆ పిల్ల.

'ఛీ... కుక్కపిల్లకు రాముడు అని పేరు పెట్టుకోడ మేమిటి?' చీదరించుకొంటూ పక్కవీధి వాలిపోయింది సుమిత్ర

రాముడి పేరు, రాముడి పోలిక ఉన్న ఎవరిని చూసినా వాడే కళ్ల ముందు కదులుతాడు సుమిత్రకు పొట్టి నిక్కరు, గళ్ల చొక్కా, చెప్పులు లేని కాళ్లు, ఒత్తుగా ఉన్న ఉంగరాల జుట్టు, మనోభావాలు ప్రతిఫలించే నిర్మలమైన కళ్లు, "అమ్మా!" అంటూ ఆప్యాయంగా వెంటతిరిగే రాముణ్ణి ఆమె ఏనాటికీ మరిచిపోలేదు. వాడి జ్ఞాపకాలు ఆమెను జీవితాంతం అనుసరించే ఉంటాయి.

ఏమిటో ఇవన్నీ అర్థం లేని అభిమానాలు. చచ్చే వరకు తను రాముణ్ణి తలుచుకొంటూ ఉంటే మాత్రం అందువల్ల వాడికి ఒరిగే దేముంది? మాటలకే కాని చేతలకు నిలవలేని ఈ మమకారాలకు విల వేమిటి? —అనుకొంటుంది సుమిత్ర.

అది తన తప్పువల్ల జరిగింది కాదు. పరిస్థితుల ప్రాబల్యం. ఏదీ తను కావాలని చెయ్యలేదు. రాముడి రాకపోకలకు తను నామమాత్రంగా నిలిచింది. తన ఊహకు అందని ఏదో మహత్తర శక్తి ఆ నాటకం ఆడించింది. తను కేవలం కీలుబొమ్మలా ఎటు దారం కదిపితే అటు తిరిగింది. అంతకన్న తను చేసింది ఏమీ లేదు—అని మనసుకు సమాధానం చెప్పుకో చూస్తుంది సుమిత్ర.

కాని, మనసు ఆమెను అర్థం చేసుకోదు. ఒక్కొక్క సారి పగవాడికన్న పరుషంగా మాటలు విసురుతుంది. ఆ సంఘటన మరపుకు రాకుండా ఆమెకు గుర్తు చేస్తుంటుంది.

రాముడు వారాల అబ్బాయిగా నాలుగేళ్లనాడు సుమిత్రకు పరిచయం అయేడు. ఒక రోజు సుమిత్ర వంటపని ముగించుకొని వీధి వరాండాలోకి వచ్చేసరికి ఆ వీధి చివర ఇంట్లో ఉండే టీచరు సుందరమ్మ రాముణ్ణి తనతో తీసుకువచ్చి సుమిత్రకు పరిచయం

> **పెట్టు పోతలతో పుట్టి పెరిగేది కాదు మమత. ఒక చల్లని చూపు, ఒక తియ్యటి మాట మమత మొలక ఎత్తడానికి దోహదం చేసేవి. ఈ మమతానుబంధం మర్రి చెట్టులా పెరిగి ఊడలు వేయడానికి, జీవితం అంతా ఆక్రమించుకొనడానికి మరేమీ అవసరం లేదు. మమత ఎంత బలిష్ఠమైనదో అంత సున్నితమైనది కూడా. మాటతో పుట్టి మాటతోనే గిట్టిపోతుంది, మరి!**

చేసింది.

"రేపటి రోజు మీ ఇంట్లో వీడికి వారం ఇయ్యాలి, సుమిత్రా!" అంది.

ఇరవై ఏళ్లకు పైగా చిన్నపిల్లలకు పాఠాలు చెబుతూ, వాళ్లను దండిస్తూ, ఆజ్ఞాపిస్తూ ఆ జీవితానికి అలవాటు పడిన సుందరమ్మ తనకన్న చిన్నవాళ్లతో మాట్లాడేటప్పుడు ఆజ్ఞాపిస్తున్నట్లుగానే మాట్లాడుతుంది. "మాటల్లో సున్నితం లేకపోయినా సుందరమ్మ మనసు మంచిది" అంటారు ఆమెను బాగా తెలిసినవారు.

"ఎవ రేమిటి ఈ పిల్లాడు?" సుమిత్ర ప్రశ్నించింది.

"ఎవరంటే ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో నాకూ తెలియదు, సుమిత్రా! దిక్కూ మొక్కూ లేనివాడు. పిల్లడు చురుగ్గా, బుద్ధిమంతుడిలా కనిపించేడు.

## ద్వివేదుల విశాలాక్షి

నలుగురి ఇళ్లలో ఇంత తిండి తింటూ, చదువుకొని బాగుపడతాడేమో అని తీసుకువచ్చేను" అంది సుందరమ్మ.

అమాయకంగా తన వంక చూస్తున్న రాముడి కళ్లు సుమిత్ర మనసును ఆకట్టుకొన్నాయి పూర్వకాలంలో అన్నదానంకోసం సత్రాలు కట్టించి సంతర్పణలు చేసేవారుట. కాలం ఎంత మారినా ఒక పిల్లడికి వారానికి ఒక రోజు ఇంత అన్నం పెట్టేందుకు కాదనలేకపోయింది సుమిత్ర.

కొద్ది రోజులలోనే రాముడు, సుమిత్ర కొడుకులు రఘు, రాజులతో నేస్తం కట్టేడు భోజనం ఏ ఇంట చేసినా, స్కూలుకు పోగా మిగిలిన సమయంలో ఆ పిల్లలతో ఆడుకొంటూ వారి ఇంటనే కాలం గడిపేవాడు.

పగలంతా ఎక్కడ తిరిగినా రాత్రి అయేసరికి సుందరమ్మ ఇంటికి చేరేవాడు రాముడు. వాడి పక్క, బట్టలు అక్కడే ఉండేవి ఆవిడతో కలిసి స్కూలుకు వెళ్లి వస్తుండేవాడు. రాత్రిపూట కాస్తసేపు రాముణ్ణి దగ్గర కూర్చోపెట్టుకొని చదువు చెప్పేది సుందరమ్మ. ఏ నెలలో అయినా కాస్త సొమ్ము మిగిలితే వాడికి ఒక జత బట్టలు కొనేది. తెలిసినవారి ఇళ్లలో రాముడి ఈడు పిల్లలు ఉంటే వారి నడి పాత బట్టలు అడిగి తెచ్చేది. అలాగే రాముడికి అవసరమైన పుస్తకాలు, నోటు పుస్తకాలు సమకూర్చేది. కాలం గడుస్తున్న కొలదీ వా రిద్దరి మధ్య ఉన్న అనుబంధం స్థిరపడి బలంగా వేళ్లు తన్నింది సుందరమ్మను రాముడు "అమ్మా!" అని పిలిచేవాడు. నిజానికి తల్లి లేని రాముడు ఆప్యాయంగా దగ్గరికి పిలిచినవారి నందరిని "అమ్మా!" అనే పిలిచేవాడు.

ఏడాది గడిచేసరికి రాముడు టీచరు సుందరమ్మగారి అబ్బాయిగా చలామణి కాసాగేడు. ఒక్కొక్కసారి సుందరమ్మ కూడా. "మావాడు మీ ఇంట్లో ఉన్నాడా?" అని అడిగేది.

ఆ సంవత్సరం రాముడు తన పుట్టిన రోజు పండగ చేసుకొన్నాడు. రాముడు ఏ రోజున పుట్టేడో ఎవరికీ తెలియదు కాని, మిగిలిన పిల్లలంతా పుట్టిన రోజులు చేసుకొంటూంటే తను చేసుకోడం లేదని వాడు బాధపడతా డనుకొంది సుందరమ్మ అందుకే సంవత్సరంలో ముందు రోజు ఎంచి, "ఈ రోజు నీ పుట్టిన రోజురా, రాముడూ!" అంది

ఆ రోజు వాడికి తలంటి నీళ్లు పోసి, కొత్త బట్టలు తొడిగింది. మిఠాయి కొనిపెట్టింది. ఆ బట్టలు చూసుకొని రాముడు ఎంతో మురిసిపోయేడు తెలిసిన వాళ్లందరి ఇళ్లకు వెళ్లి తన కొత్త బట్టలు చూపించేడు. సుందరమ్మ కొనిపెట్టిన మిఠాయి తన స్నేహితులకు పంచిపెట్టేడు ఆ రోజు పొడుగునా తరగని సంతోషం రాముడి ముఖాన తాండవించింది.

రాముడు ఇంకో పుట్టిన రోజు జరుపుకోకుండానే హఠాత్తుగా [illegible] ఆ సమయంలో చచ్చిపోయింది సుందరమ్మ. తెల్లవారి పనిమనిషి [illegible] ఆ భోగట్టా [illegible] సుందరమ్మ [illegible] దిగబడ్డారు.

సుమిత్ర అక్కడికి [illegible] ఇల్లంతా [illegible] లతో నిండి ఉంది సుందరమ్మకు రావలసిన సొమ్ము గురించి, అక్కడ ఉన్న వస్తువుల పంపిణీ [illegible] చర్చలు జరుగుతున్నాయి. కొంతమంది అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదొమ్మిలో రాముడు ఎక్కడ ఉన్నాడో సుమిత్రకు కనిపించలేదు. [illegible] కూర్చుని సుందరమ్మ మరణానికి కన్నీరు కారుస్తున్న ఒక ముసలావిణ్ణి అడిగింది

"రాముడా? రాము డెవరు? ఇక్కడ ఎవ్వరూ లేరే" అంది ఆవిడ

మరునాడు ఆదివారం ఆరోజు సుమిత్ర ఇంట రాముడికి వారం. పన్నెండు గంటల వరకు సుమిత్ర ఎదురుచూసినా రాముడు రాలేదు. "నిన్న కూడా కనిపించలేదు. రాము డేం చేస్తున్నాడో పోయి చూడిరా" అని కొడుకును పంపింది

"అమ్మా, రాముడి ముఖం ఇంతలా పొంగి ఉంది. ఒళ్లంతా వేడిగా కాలిపోతున్నాది. పిలుస్తే పలకలేదు"

పరాభవ
దీపావళి కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందినది

మీ వంట పాత్రలను అశాస్త్రీయమైన పద్ధతిలో శుభ్రము చేయుచున్నారా ?




శాస్త్రీయపద్ధతిలో వంట పాత్రలను శుభ్రముచేయు 'ట్రిమ్' నే వాడండి

ఉచితం! ఉచితం!! ఉచితం!!!



పారిస్ బ్యూటీ శాలువలు, పూర్తిసైజవి, అందమైన డిజైన్లు, రంగులు, 1 శాలువ రు. 7—50, 2 రు. 14—00, 3 రు. 19—50. స్పెషల్ క్వాలిటీ 1 శాలువ రు. 10—00, 2 రు. 19—00, 3 రు. 27—00, సూపర్ క్వాలిటీ 1 శాలువ రు. 12—00, 2 రు. 22—00, 3 రు. 30—00. చిన్న పిల్లల సైజు 1 రు. 6—00, 2 రు. 11—00, 3 రు. 15—00, ఒక పార్శెలులో 2 లేక ఎక్కువ శాలువలు తెప్పించు కొనువారికి ఒక అందమైన స్త్రీల పర్సు ఉచితం. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుచు నేడే ఆర్డరు ఇవ్వండి

**Paris Commercial Co. (APRW), Post Box No. 1804, Delhi-6.**




'Rama Pubs.'

# భావబంధం

అన్నాడు రఘు తిరిగివచ్చి.

సుమిత్ర కళ్లకు "అమ్మా! అమ్మా!" అంటూ బెంగతో ఏడుస్తున్న రాముడు కనిపించేడు. ఫ్లాస్కులో కాఫీ పోసుకొని, "పద. రాముణ్ణి చూసి వద్దాం" అంటూ రఘును తీసుకొని సుబ్బమ్మ ఇంటికి బయలు దేరింది. ఒళ్ళు తెలియని జ్వరంతో పడి ఉన్న రాముడు గురించి సుమిత్ర చెప్పినా అక్కడ చేరిన అంతమందిలో ఒక్కరైనా ఆ పిల్లడి గురించి జాలిగా ఒక్క మాట అనలేదు. ఆ పరిస్థితిలో రాముణ్ణి అక్కడ విడిచి రాలేకపోయింది.

● ● ● ●

సుమిత్ర పరిచర్యతో రాముడు త్వరగానే కోలుకొన్నాడు. రఘు, రాజులతో కలిసి స్కూలుకు వెళ్లి రావడం మొదలుపెట్టేడు. ఇంటిలో ఆడుకొనేందుకు పిల్లలు, అభిమానంగా చూసే సుమిత్ర, అదేదో కొత్త జీవితంలా అనిపించింది రాముడికి. ఆ జీవితాన్ని ఆప్యాయంగా రెండు చేతుల మధ్య పొదివి పట్టుకొని ఆనందంగా అనుభవించసాగేడు.

ఒక్కొక్కసారి భయం, జాలి మనిషిచేత అనాలోచితంగా అనేకమైన పనులు చేయిస్తాయి. ఆ సంకట పరిస్థితి దాటిపోయి తాపీగా ఆలోచించుకొన్నాక అందులోని సాధక బాధకాలు అవగతమవుతాయి. నిరాశ్రయంగా ఒళ్లు తెలియని జ్వరంతో సతమతమవుతున్న రాముణ్ణి ఆదుకొని ఇంటికి తెచ్చిననాడు వాడు ఒక సమస్యగా తనకు నిలుస్తాడని సుమిత్ర భావించి ఉండలేదు. మూడు నెలలు అటునుండి ఇటు తిరిగేసరికి ఊహించని ఆ పరిస్థితి ముందుకు వచ్చి నిలిచింది.

సుమిత్ర భర్త వాసుదేవరావు మధ్యతరగతి కుటుంబీకుడు. నలుగురు పిల్లల తండ్రి. తనకు వచ్చే జీతం తెచ్చి భార్య చేతిలో పెట్టి, మిగిలిన బాదరబందీనుండి తప్పుకొనే విరాగి. అనుకూలవతియైన సుమిత్ర మాటలపైనా, చేతలపైనా గౌరవం, నమ్మకం ఉన్నవాడు. ఆమె రాముణ్ణి తెచ్చి ఇంట్లో పెట్టిననాడు, ఈ నలుగురు పిల్లలతోనే సంసారం సాగడం కష్టంగా ఉంటే వీడి నెందుకు తెచ్చావని భార్యను ప్రశ్నించలేదు. ఆ మెలుకువ ఏదో ఆమే చూసుకొంటుందని ఊరుకొన్నాడు.

నాలుగు నెలలు గడిచేసరికి తను అనాలోచితంగా చేసిన పనిలోని కష్టనిష్ఠూరాలు సుమిత్రకు అర్థమయేయి. రోజురోజుకు రాముడు తమ కుటుంబంలో కలిసిపోతున్నాడు. ఇంక అట్టేకాలం ఇలాగే సాగితే తిరిగి వాడిని వేరు చెయ్యడం కష్టం. వాడిని పోషించి, పెంచి, పెద్దచేసే తాహతు తమకు లేదు. రాముడి లేతమనసు గాయపడకుండా వాడికి ఇది విడమరిచి చెప్పడం ఎలా — అని సుమిత్ర మథనపడ్డాది.

అదివరలో వాడికి వారం ఇచ్చిన వర్ధనమ్మగారితో ప్రస్తావించింది. ఆమె సహృదయంతో సుమిత్రను అర్థం చేసుకొంది. ఆ చిక్కుముడి విడేందుకు తనకు తోచిన ఉపాయం చెప్పింది.

మరునాడు ఉదయం స్నానం చేసి, బట్టలు వేసుకొన్న రాముడికి తల దువ్వుతూ, "ఈ రోజు వర్ధనమ్మగారు నిన్ను వారింటికి భోజనానికి పిలిచేరురా" అంది సుమిత్ర. రాముడు తల ఎత్తి సుమిత్ర ముఖం వైపు చూసేడు

"నన్ను ఒక్కడినేనా? రఘును, రాజును కూడా పిలిచేరా?" అన్నాడు

ఆదివరలో సుమిత్ర బంధువుల ఇంట పిల్లడి పుట్టిన రోజుకు పిలిస్తే ముగ్గురూ కలిసి వెళ్ళేరు ఆ సంగతి రాముడి మనసులో మెదిలింది.

"నువ్వు వెళ్లిరా వాళ్లను పిలవలేదు" అంది సుమిత్ర, ఆ పిల్లడి చూపులు తప్పించుకొంటూ

మరునాడు సుభద్రమ్మ, ఇంకోనాడు వెంకాయమ్మ, ఆటు తరవాత సాంచారమ్మ—ఇలా ఆదివరలో రాముడికి వారా లిచ్చినవారందరూ రోజుకు ఒకరు చొప్పున వాడిని భోజనానికి పిలవసాగేరు. నాలుగైదు రోజులు గడిచేసరికి రాముడు సంగతి గ్రహించుకొన్నాడు ఆరవనాడు సుమిత్ర చెప్పనక్కరలేకండానే బట్టలు వేసుకొని హనుమాయమ్మగారి ఇంటికి వెళ్లిపోయేడు పూర్వం తను కూర్చునే స్థలంలో పీట వాల్చుకొని, కంచం, గ్లాసులో నీళ్లు పెట్టుకొని కూర్చున్నాడు. ఆనాడు ఆ కుర్రాడికి ముద్ద మింగుడు పడలేదు.

"ఏం, ఇంకా ఒళ్లు సరిపోలేదురా? అలా తిన్నావు?" అని పరామర్శించింది హనుమాయమ్మ

ఆదివారంనాడు పది గంటలవేళ సుమిత్ర వంట ప్రయత్నంలో ఉండగా రాముడు ఆమె దగ్గరగా వచ్చి, "ఈ రోజు ఇక్కడే భోజనం చేస్తానమ్మా!" అన్నాడు.

క్షణకాలం రాముడి కళ్లలోకి చూసింది సుమిత్ర "అలాగే, రాముడూ!" అంది మెల్లగా నోరు పెగుల్చుకొని

కాలిన వెంటనే ఉన్న బాధ కలకాలం నిలిచిపోదు. నెల రోజులు గడిచేసరికి సుమిత్ర, రాముడు బరువు మలకన పడినట్లు ఊపిరి పీల్చుకొన్నారు రాముడి జీవితానికి ఒక పద్ధతి అంటూ ఏర్పడినందుకు సుమిత్ర సంతోషించింది

సుందరమ్మ మరణం రాముడి మనసులో మరుగున పడినా అభిమానంతో ఆమె జరిపిన పుట్టిన రోజు పండగ మాత్రం మరిచిపోలేదు ఆటల సమయంలో, ఇంక మనసులో నిలుపుకోలేక, "రేపు నా పుట్టిన రోజు" అన్నాడు రాముడు రాజు ఒక్క పరుగులో తల్లి దగ్గరికి చేరేడు

"అమ్మా, రేపు రాముడి పుట్టిన రోజుటమ్మా" అన్నాడు.


"రాముడు చెప్పేడా? సరిలే వాడికి సేమ్యా పాయసం ఇష్టం కదా? రేపు చేసి పెడతాలే" అంది సుమిత్ర చేతిలో పని ముగిస్తూ

"మరి మరి కొత్తబట్టలో?" రాజు ప్రశ్నించేడు

"రాముడు కావాలన్నాడా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది సుమిత్ర.

"లేదమ్మా. వాడు అసలు నీతో ఈ సంగతి చెప్పమననేలేదు" అన్నాడు రాజు.

ఆ ఉదయంనుంచి రాముడి మనసులో కదలుతూ నోటితోచెప్పలేని విషయం సుమిత్రకు అర్థమయింది ఆ పిల్లడి ఆలోచన, ఆశకూడా అవగతమయేసరికి కాస్తసేపు ఇటు, అటు ఊగింది మనసు రెండునెలల క్రిందట రఘు పుట్టినరోజునాడు సొమ్ము సర్దుబాటు కాక వాడికి కొత్తబట్టలు కొనలేకపోయింది సుమిత్ర తలంటి నీళ్లుపోసి, చాకింటి బట్టలు తొడిగిన కొడుకును చూసి, వెంటనే వీధిలోకి వెళ్లిపోయేడు వాసుదేవరావు. ఒక గంటలో అప్పో, సప్పో చేసి రెడీమేడ్ నిక్కరు, లాల్చి కొని తెచ్చేడు.



వెలుగుల వర్షాలు — ఫోటో—ఎ. వి. శంకరశాస్త్రి (మంగళగిరి)

"కొత్తబట్టలు లేకపోతే పుట్టినరోజులాగ ఉండదు" అన్నాడు రాముడు రఘు కొత్తబట్టలు చూసి.

ఆమాట సుమిత్రకు తలపుకు వచ్చింది. పెట్టె అడుగున ఏ అవసరానికైనా ఉంటాయని దాచిఉంచిన పదిహేను రూపాయలు తీసుకొని బజారుకు బయలుదేరింది.

రాముడు మరొక పుట్టినరోజు జరుపుకొనేసరికి వాడి జీవితం ఇంకో మలుపు తిరిగింది రాముడికి వారా లిచ్చినవారిలో మూడు కుటుంబాలు బదిలీల మూలంగా పై ఊళ్లకు వెళ్లిపోయేయి మిగిలినవారు కూడా కరువు కాటకాలమూలంగా తమ అశక్తత వ్యక్తం చేసేరు. అందరిలా తను తప్పుకోలేకపోయింది సుమిత్ర.

సుమిత్రకు అంపోశనకరంగా పరిణమించిన ఈ విషయం రాముడికి ఆనందదాయకం అయింది తిరిగి తను ఆ ఇంటివాడయేడని మురిసిపోయేడు ఎంతకాలంగానో చెరిగిపోయిన నవ్వు తిరిగి ఆ కుర్రాడి ముఖంమీద తొంగిచూసింది పెరట్లో చెట్లమధ్య, వీధిలో పిల్లల మధ్య కట్టుతాడు విడిన లేగదూడలా గంతులు వేయసాగేడు

అకాలమేఘంలా కరువు పొంచి, పొంచి అంచెలంచెలుగా వచ్చి దేశాన్ని ఆవరించుకొంది ఎక్కడ చూసినా తిండిగింజల కోసం సంకటపడే జనం హద్దులుదాటి, అరాజకాలను లేవదీస్తూ, ఆకలి మంటలకు తాళలేక నైరాశ్యంతో చిందులు తొక్కసాగేరు దేశంలో డబ్బులేదు డబ్బున్నా తిండిలేదు అన్న పరిస్థితి ఏర్పడింది 'జీతాలు పెంచండి తిండి

గింజలు చౌకగా పంచండి' అనే నినాదాలు దేశంలో ఎటుపోయినా చెవులు చిల్లులుపడేలా మిన్నుముట్టి సాగేయి.

ఈ జడివానలో తడిసి ముద్దయిన అనేక కుటుంబాలలో వాసుదేవరావుది ఒకటి. నెల ముగిసేందుకు ఇంకా పదిరోజులు ఉండగానే నిండుకున్న బియ్యపు జాడీ, నేలమీద దొరిలి పడిఉన్న పాప పాలడబ్బా, చిల్లరగా మారిన జీతం డబ్బులు చూస్తుంటే వెనకా, ముందూ ఊహించలేక సుమిత్ర మనసు భయంతో, వేదనతో అణుచుకోలేని ఆరాటంతో ఊగిపోయేది. బ్రతికేందుకు ఏది మార్గం, భగవంతుడా! ఈ పిల్లల్ని ఎలా పెంచేది — అని వాపోయేది. కడుపునిండా పిల్లలకు అన్నం పెట్టి మరి కాస్త తినమని బ్రతిమిలాడే తల్లి, ఈ పిల్లలు మరీ ఇంతలా తింటున్నారేమిటి — అని అనుకోడంలో ఉన్న అగాధమైన బాధ, ఆత్మక్షోభ అనుభవించిన తల్లులకే అర్థమవుతుంది. మిగిలిన పిల్లలకన్న మరి పట్టెడన్నం జాస్తిగా తినే రాముడి మీద సుమిత్ర దృష్టి పడిన రోజులు లేకపోలేదు.

"మరీ ఏమిటిరా, రాముడూ, ఆ తిండి? మా దరిద్రం,నీ ఆకలి తీరేలాలేవు" అని సుమిత్ర విసుక్కొన్న సమయాలు కూడా ఉన్నాయి.

అటువంటి సంఘటన జరిగిన తరవాత రాముడు మారు అడిగేందుకే భయపడేవాడు. కంచంలో మిగిలిన నాలుగు మెతుకులు ముందుకు తీసుకొని "మజ్జిగ" అనేవాడు. వాడి మాట సుమిత్రకు కళ్లంట నీళ్ళు తెప్పించేది. "మరికాస్త అన్నం వేసుకో, రాముడూ! కంచంలో అన్నం లేందే" అంటూ రెండు గరిటెల అన్నం తెచ్చి వడ్డించేది.

రాముడు ఎదురుగా ఉన్నంతసేపు వాడిని తన పిల్లలకు భిన్నంగా చూసే తత్వం సుమిత్రకు అలవడలేదు. కాని రాముడు కనుచాటు కాగానే ఆ పిల్లడి భారం వామనమూర్తిలా పెరిగి, పెరిగి తన సంసారాన్ని నేలమట్టం చేస్తున్న భావన ఆమెకు కలిగేది.

ఈనాడు ఇంత తిండి పెట్టడంతో రాముడి బాధ్యత తీరిపోదు. వాడి చదువు చూడాలి. వాడి బ్రతుకు చూడాలి. బలపడినకొద్దీ ఈ అనుబంధం సడలించుకోవడం కష్టం. తను బిడ్డలులేని గొడ్రాలు కాదు. తమకు అవసరానికి మించిన ఆదాయం లేదు. దారినిపోయేవారందరినీ తెచ్చి పోషించేటంత దాతృత్వం తనకు లేదు. తను ఈ బంధనలో ఎందుకు చిక్కుకోవాలి? రాముడికోసం తన బిడ్డలకు ఎందుకు లోటు చెయ్యాలి?

అనాథుడైన రాముణ్ణి ఏ అమ్మ అయినా దయతలిచి చేరదీస్తుంది. నాలుగిళ్ల యాయవారం అడుక్కునైనా రాముడు బ్రతకగలడు ఈనాడు తను తప్పుకొంటే ముందులాగే వారాలు ఏర్పరుచుకొంటాడు. ఈ వాడలో కాకుంటే ఇంకో వీధిలో ఈ ఊరు కాకపోతే ఇంకో ఊరు ఇతరులపై ఆధారపడి బ్రతికేవారికి ఎక్కడ భుక్తి గడుస్తే అదే తమ ఊరు.

తల్లిగా తన కర్తవ్యం తన పిల్లలకు ఏది మంచిదో దానిని ఆచరించడం రాముడికి దయతలిచి చేరదీసిన వారంతా తల్లులే. తన పిల్లలకు తానుమాత్రమే తల్లి — అనుకొంది సుమిత్ర.

ఆలోచనలు ఇటు అటు మనసును మథించేయి.

# భావబంధం

ఆ రాపిడికి కరిగిపోయిన మంచితనంలోంచి స్వార్థం పైకి లేచింది. క్షీరసాగర మథనంనాడు కూడా ముందుగా హాలాహలమే పైకి వచ్చిందిట. కాని దేవతలు ఓర్మితో ప్రయత్నం విడవక అమృతాన్ని అందుకొన్నారు. సుమిత్రకు అంతటి సహనం లేకపోయింది. అమృతోదయం అయేవరకు మనోసాగరాన్ని మథించలేకపోయింది. ఆ హాలాహలాన్ని గరళకంఠుడిలా రాముడు ఆరగించేడు.

ఆ సమయం, ఆ సంఘటన తలపుకు వస్తున్న కొలదీ సుమిత్ర మనసు దహించుకుపోసాగింది. తనది అనుకొన్న ఇంటిని, తనవారు అనుకొన్న మనుష్యుల్ని వదిలి రాముడు వెళ్లిపోతూ చూసిన ఆ చూపు సుమిత్ర చుట్టూ సాలెగూడులా అల్లుకుపోయింది. ఆ బాధనుండి రక్షిస్తాడనుకొన్న భర్త కూడా, "నువ్వు తొందరపడ్డావు, సుమిత్రా" అని నిందించేసరికి అహం లేచి ఆమెకు శక్తి ఇచ్చింది.

"నేనేం తొందర పడలేదు. బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చేను. ఒక్క పిల్లడయితే మాత్రం ఈ రోజుల్లో మనలాంటివాళ్ళు భరించడం మాటలా? మనకంత శక్తి లేదు" అంది ఖండితంగా.

"కనీసం వాడికి వారాలైనా ఏర్పరిచి మరీ పొమ్మనవలసింది, సుమిత్రా!"

"ఉన్నపళంగా నేను మాత్రం పొమ్మన్నానా? నా ఇంట ఒకరోజు భోజనం పెడతాను. మిగిలిన వారాలు చూసుకురారా —అన్నాను. వెళ్లినవాడు అదే పోవడమా?

దీపసుందరి

చిత్రం — హరేమంత శ్రీనివాసరావు (గుంటూరు–2)



వాడికే అంత నామర్దా అయితే ప్రతి ఇంటికి వెళ్లి నేనెలా దేబిరించను, చెప్పండి? అయినా ఈ కరువు కాలంలో అడిగిందికైనా నోరు రావాలా?"

"మరి వాడికిమాత్రం ఎవరిస్తారు?"

"ఏమో వాడి అదృష్టం! వారు పోసినవాడు నీరు పోస్తాడంటారు. ఎవ్వరూ తిండిలేక చచ్చిపోరు" అంది సుమిత్ర బింకంగా.

మరునాటికే ఆమె ధైర్యం సన్నగిల్లిపోయింది. పిల్లలకు చద్దిఅన్నాలు పెడుతూంటే రాముడు తలపుకొచ్చేడు. నిన్నరోజు ఏమైనా తిండి దొరికిందో లేదో? ఆకలితో లుంగ చుట్టుకొని ఏ మూల పడుకొన్నాడో? రాజును చూసి రమ్మన్నా బాగుండును. ఎలాగా ఒకరోజు భోజనం పెట్టాలనుకొన్నాను కదా, ఈ రోజు తినిపోతాడు అనుకొంది సుమిత్ర. పది గంటలవేళ రాజు తిరిగి వచ్చి రాముడు కనిపించలేదన్నాడు.

"అన్నిచోట్లా సరిగా చూసేవురా? మీ స్నేహితుల ఇళ్ళు, మీరు రోజూ ఆడుకొనే స్థలాలు, మీ స్కూలు దగ్గర..."

"అన్నిచోట్ల చూసేనమ్మా! ఎక్కడా కనిపించలేదు."

ఆఁ ఎక్కడో తినే ఉంటాడు. తన ఆత్రతే కాని ఆ పిల్లడి ఆ మాత్రం తిండిపెట్టగల ధనవంతులే ఈ పట్నంలో లేరా? ఈసరికి ఏదో ఇంట్లో చోటు చూసుకొనే ఉంటాడు అనుకొంది సుమిత్ర

సాయంకాలం మొక్కలకు నీళ్ళు పోస్తుంటే రాముడు పాతిన జామి మొక్క కనిపించింది. ఎవరో స్నేహితుడి ఇంటిలోంచి తెచ్చి, ఒక రోజల్లా శ్రమపడి గొయ్యి తవ్వి దానిని పాతేడు దానికి రోజూ తను స్వయంగా నీళ్ళ పోసేవాడు పాదునిండుగ రెండుపూటలా నీళ్ళు పోస్తే త్వరగా పెరిగి కాయలు కాస్తుందని ఆ పిల్లడి అభిప్రాయం. "మన పెరట్లో ఇంకా చాలా పళ్లచెట్లు వెయ్యాలమ్మా! మనం కాయగూరలు, పళ్ళు ఎక్కువగా తిని అన్నం తగ్గించుకోవాలిట అన్నం లేక ఎంతోమంది చచ్చిపోతున్నారని మా మేష్టారుగారు చెప్పేరు" అన్నాడు.

జామిచెట్టుకు నీళ్ళు పోస్తూ ఈరోజు ఆ అన్నార్తుల జాబితాలోకి రాముడుకూడా జమ అయిపోయాడా అనుకొంది సుమిత్ర. రాముడికి అటువంటి దుర్గతి పట్టదు. వాడి కళ్లు చూస్తే ఏ తల్లి మనసయినా కరిగిపోతుంది అని మనసుకు సమాధానం చెప్పుకొంది

ముద్దమందారమొగ్గ తొడిగింది రాముడికి ఆ మొక్కంటే ప్రాణం ఏ చిగురాకు సందులోనుంచైనా చిన్న మొగ్గ తొంగి చూస్తుందేమో అని రోజూ దాని కొమ్మల్ని వంచి చూసేవాడు. ఆ చెట్టుకు మొదటి మొగ్గ చూసిననాడు రాముడి ఆనందం చెప్పనలవికాకపోయింది. "అమ్మా! ఇంక రోజూ మీ పూజకి మన మందార పువ్వులిస్తుంది. ఒక్క మొగ్గ వచ్చిందంటే ఇంక విరగపూస్తుందిట. గోపాలం వాళ్లింట్లో చెట్టు నిండా పువ్వులే" అన్నాడు.

రోజు రోజుకు ఆ మొగ్గ ఎంత పెరిగింది. ఎప్పటికి పువ్వు విడేది లెక్క గట్టేవాడు. "ఏమిటో ఈ పిల్లడికి మొక్కలంటే ఇంత పిచ్చి" అనేవాడు వాసుదేవరావు.

రక్షక దళాలమధ్య ఎర్రని రూపును దిద్దుకొంటున్నాది మందార. రాముడు ఒకసారి వచ్చి చూస్తే బాగుండును. సంతోషిస్తాడు. రేపో, ఎల్లుండో ఇక్కడికి

వారానికి రాడా. అప్పుడు మరిచిపోకుండా చూపించాలి అనుకొంది సుమిత్ర.

ఆ రేపు, ఎల్లుండి రాముడు రాకుండానే గడిచిపోయే సరికి సుమిత్ర కాలు నేలమీద నిలవలేదు. "వాడి కోసం అంత ఆత్రత పడేదానివి అర్ధాంతరంగా వాడిని ఎందుకు పంపివేసేవు?" భర్త నిలదీసేడు.

"బాగుందండీ! వాడికోసం నేనేం కంగారుపడు తున్నాను? రావలసినవాడు రాకపోతే ఏమా అను కొంటున్నాను. వారంవాడు ఉదయాన్నే వచ్చి చెప్పక పోతే ఎలా? ఏరోజుని వాడికోసం వండుకోను? తిన్నంత తిని మిగిలింది పారబోసుకొనే రోజులా? బియ్యపుగింజ పుట్టడం గగనమయిపోతుంటేను" అంటూ మాట ఆపకుండా అరగంట వాగి, వాగి మనసు చులకన పరుచు కొంది సుమిత్ర.

మరునాడు కూడా రాముడు రాలేదు. "ఎక్కడో మన్సుగా మేసేవాళ్ల ఇళ్ల వారాలు దొరికి ఉంటాయి. వెళ్లినవాడు ఇటు తిరిగి చూడలేదు. ఆ మాట కాస్తా నా చెవిని వేస్తే తప్పా? అయినా ఈ రోజుల్లో విశ్వాసం ఎవరికుంటున్నాది లెండి. ఇంతకాలం వీరి ఇంట్లో ఉండి తిన్నానే ఈరోజు పెట్టనంత మాత్రాన..."

"ఆ విశ్వాసం వాడికి ఉండబట్టే రాలేదేమో? ఆకలితో మాడే తన కడుపుని మన ఎదుట చూపి, మన దయావిహీనతని ఎత్తి చూపే సాహసం వాడికి లేకపోయి రావడానికి వెనుదీసేడేమో" అన్నాడు వాసు దేవరావు.

"అవేం మాటలండీ! ఇంతకాలం రాముడు తిండి లేకుండా ఉన్నాడంటారా? ఊరంతా గొడ్డుపోయిందా?"

"ఊరు గొడ్డుపోలేదు, సుమిత్రా! కాని చాల వరకు అంతా మనలాంటివారే. మిగిలిన ఏ కొద్దిమంది ధనవంతులకి రాముడి ఆకలి గొడవ పట్టవలసిన అవసరం ఏముంది?"

"అలా ఎన్నటికీ జరగదండి. రాముడివంటి పిల్లడు ఆకలితో 'అన్నం' అని చెయ్యి జాస్తే ఏ తల్లి కాదన గలదు! ఈ పాడుకాలం ఇలా దాపురించబట్టే కాని, లేకపోతే నేను వాడిని ఇంటినుండి పంపేదానినా?"

రాముణ్ణి పంపివేసిన మరుక్షణం నుండి వాడు తిరిగి వస్తే బాగుండునని సుమిత్ర అనుకొంటున్నాదని వాసుదేవరావుకు తెలియకపోలేదు. రాముడిని వెతికి తీసుకు రావడం కూడా అంత కష్టమైన పనికాదు. కాని అందువల్ల ఇది తీరే సమస్యకాదు. నాలుగురోజుల నాటికే మళ్లా మొదటికి వస్తుంది. నానాటికి పెరిగి పోతున్న ఈ ధరవరల ధాటికి ఆ అభిమానం అట్టే కాలం తట్టుకు నిలవలేదు.

సుమిత్ర రాముడిమీద అభిమానం చంపుకోలేదు. వాడుకూడా తన బిడ్డడే అనుకొని భరించలేదు. రాముడు సుఖంగా ఉండాలని ఆమె కోరిక. కాని, రాముడి సుఖంకోసం తను ఏమీ చెయ్యలేని పరి స్థితిలో గిలగిల కొట్టుకొంటున్నాది — అనుకొన్నాడు వాసుదేవరావు.

రాముడు వెళ్లిపోయి ఐదు రోజులయింది. ఏమైనా ఈ రోజు వాడిని వెతికి తీసుకురావాలి. కరువో, కాట కమో మా అందరితోపాటే వాడూ. ఉంటే తింటాడు, లేకుంటే పస్తుంటాడు అన్న నిశ్చయం చేసు కొని సుమిత్ర వీథిలోకి వచ్చింది. ఆమె ఇంకా గుమ్మం దిగనే లేదు. కిరాణాకొట్టు యజమాని ఎదురయేడు.

"ఏం అమ్మగారూ! ఈ విధాన పద్దులు చెల్లకాక పోతే మేం వ్యాపారం ఎట్లా చెయ్యడం? కిందటి నెల బాకి చెల్లకాగా ఈ నెల పద్దులో సగమైనా చేతిలో పెట్టకపోతే ఎట్లాగమ్మా? మా పిల్లా, పాపా బతికి బాగుపడాలా వద్దా, తల్లీ?" అంటూ పాఠం మొదలు పెట్టేడు.

అతడిని అతి కష్టంమీద సమాధానపరిచి, ఇక ముందు ఇలా జరగబోదని హామీ ఇచ్చి పంపివేసి, వీళ్ళ కారిన నిర్ణయంతో ఇంటిలోకి వెళ్లిపోయింది సుమిత్ర.

ఆనాడు ఆదివారం. పీడ కలలతో నిద్ర తేలిపోగా ఇంకా కొంచెం చీకటి ఉండగానే పెరటిలోకి వచ్చింది సుమిత్ర. నవ వికసిత పుష్పాలు అప్పుడే తమ సొగసులు దిద్దుకొంటున్నాయి. మంచు బిందువులు పూరేకుల మీద నుండి జారిపడి ముత్యాల్లా ఆకులమీద మెరు స్తున్నాయి. నిదుర లేచిన పక్షులు తమ గొంతులు సాపు చేసుకొంటున్నాయి.

నోటిలో పుల్ల, చేతిలో కచ్చికతో బయటికి వచ్చింది సుమిత్ర. నిమ్మచెట్టు వెనకగా, మందార మొక్క పక్కగా ఏదో నీడ కదిలినట్లు ఆమెకు అనిపించింది. "ఎవరది?" అంటూనే మరి రెండు అడుగులు ముందుకు వేసింది. తొలి అరుణరేఖ అప్పుడే తిన్నగా పొడుచుకు వచ్చింది. ఎర్రని ఆకాశం నెమ్మదిగా తెల్లదనం అద్దుకొంటున్నాది. సుమిత్ర కళ్లలో బాలారుణ కాంతులు ప్రతిఫలించేయి.

రాముడే వచ్చి ఉంటాడు తనకు అన్నం పెట్టి అభిమానించిన నన్ను చూసేందుకు రాకపోయినా తన ప్రాణసమానంగా పెంచిన మందారమొక్క ప్రథమ పుష్పాన్ని ఈ లోకంలోకి ఆహ్వానించి, దాని అందచందాలు చూసి మురిసిపోయేందుకు వచ్చి ఉంటాడు — అను కొంది సుమిత్ర.

ఆ క్షణంలో ఆమె మనసులో ఆలోచనా తరంగాలు అతి త్వరగా దూసుకుపోయేయి. రాముణ్ని చూసీ చూడనట్లు ఇంట్లోకి తిరిగి వెళ్లిపోవడమా, లేక అభి మానంగా తన కుటుంబంలోకి ఆహ్వానించడమా? ఈసారి రాముడు తన ఇంట కాలుపెడితే ఒక అనాథ బాలుడుగా కాదు, తన కొడుకుల్లో ఒకడుగా. దానికి తను తయారుగా ఉంటేనే కాలు ముందుకు కదపాలి. లేని ఎడల తన పలకరింపులో అర్థం లేదు — అను కొంది.

ఆమె కాలు ముందుకే పడింది.

"రాముడూ!" ఆమె పిలుపులో ఆప్యాయత పులక రించింది. ఆమె మనసులాంటి గాలి నిమ్మచెట్టు రెమ్మల్ని కదిపి పోయింది. నిమ్మచెట్టును దాటి ఆమె చూపు ముందుకు పోయింది.

అందినకాడికి మందారకొమ్మను పువ్వు సమేతంగా నోటను కరుచుకు పరుగు తీసింది ఒక నల్లమేక. సుమిత్రకు కళ్ళు తిరిగినట్లయింది. రెండు చేతుల మధ్య ముఖాన్ని ఇముడ్చుకొని కొంచెంసేపు బొమ్మలా కూర్చుంది. ఎదురుగా బిడ్డను కోల్పోయినట్లు దిగులుగా, వెలితిగా వెలవెలపోతున్న మందారమొక్క. ఆప్యాయంగా ఆ మొక్కను ఒకసారి తాకింది సుమిత్ర. ఆకులపై నిలిచిన మంచు బిందువులు జలజల సుమిత్ర పాదాలపై రాలేయి. ★

**యువతీ యువకులారా!**

ఒక్క మాట! మీ యవ్వనం పొంగి పొరలే వేళ ఆనందం కోసం చేసిన సాహసాలు, ప్రేమలూ పొరపాట్లుగా మారవచ్చు. జ్ఞాపకాలతో మీ రెండుకు కుంగి పోవాలి. మనసులో బాధ చెప్పు కుంటే పోతుంది! మీరు విన్నవీ, చూచినవీ— చేసినవీ అన్నీ వ్రాయండి! మీలాగే జీవితంలో ఏదో వెలితిగా బాధపడే ప్రేయసీ ప్రియులకు మార్గదర్శకం అవుతుంది. మీకూ చక్కని మార్గం స్ఫురించవచ్చు. బావుంటే మీకు మంచి బహుమతి రావచ్చు! వ్రాయండి! చదవండి! మీ కోసమే! సం|| చందా రు. 6/— దీపావళి సంచిక 75 పైసలు.

**చిత్రాంగి** (సరసశృంగార సాహిత్య మాసపత్రిక)
సబ్‌కలెక్టరాఫీసు వద్ద, **విజయనగరం—3.**
ఏజెన్సీలేనిచోట్ల డిపాజిట్టుకట్టగల ఏజెంట్లుకావాలి

## సరికొత్త ప్రచురణలు

వేల్పూరి సుభద్రాదేవిగారి
**మంచుబొమ్మలు** రు. 5—00
(ఆంధ్రప్రభ ఉగాది నవలా పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల)

ఎ. శ్యామలా రాణిగారి
**జీవ వాహిని** రు. 5—00
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్స్ వెలువడిన నవల)

ముప్పాళ రంగనాయకమ్మగారి
**గులాబి పూసింది** రు. 5—00
**పందిట్లో పెళ్లవుతోంది** రు. 3—00

కోడూరి కౌసల్యాదేవిగారి
**సుప్రభాతం** రు. 4—00
**శోభకృతు** రు. 4—00

వి.పి. పద్ధతి లేదు ముందుగా డబ్బుపంపిన వారికి పోస్టేజి ఉచితం.

ప్రతులకు: —
విజయసారథి పబ్లికేషన్స్
**విజయవాడ - 2**